క్లుప్తంగా

ఘనంగా 'వీడ్కోలు'



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కెరమెరి: మండలంలోని గోయగాం ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. 9వ తగరతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తెలుగు, హిందీ, గోండి పాటలపై చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎంఈవో ఆడే ప్రకాశ్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి పదో తరగతిలో ఉన్నత గ్రేడులు సాధించాలన్నారు. కెరమెరి, ఝరి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్, ఉపాధ్యాయులు నల్లగొండ రమేశ్, ప్రవీణ్, భరత్‌రావు తదితరులు ఉన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



పరిచయం చేసుకుంటున్న నాయకులు

కెరమెరి: మండలంలోని నెహ్రూనగర్‌లో ప్రారంభమైన శ్రీ వెంకటేశ్వర స్వామి జాతరలో మంగళవారం కబడ్డీ పోటీలను మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలతో స్నేహభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు పెందోర్ ఆనంద్‌రావు, సెడ్మకి తుకారాం, దండు, రాము, నగేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

'విద్యార్థులు బాగా చదవాలి'



విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈవో ప్రకాశ్

కెరమెరి: విద్యార్థులు బాగా చదువుకోవాలని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని జోడేఘాట్ ఆశ్రమ పాఠశాలతో పాటు చిన్న పాట్నాపూర్, పెద్ద పాట్నాపూర్ గిరిజన ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు చదివించారు.

మూఢ నమ్మకాలు వీడాలి



ఆర్‌ఐకి వినతిపత్రం ఇస్తున్న బౌద్ధులు

వాంకిడి: మూఢ నమ్మకాలు వీడాలని ఆల్ ఇండియా భిక్కు సంఘం ప్రధాన కార్యదర్శి, బౌద్ధ గురువు భంతే భదంత్ ధమ్మ సారథి సూచించారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహారలో నిర్వహిస్తున్న శ్రామ్‌నేర్ శిబిరం మంగళవారం రెండోరోజుకు చేరింది. శిబిరానికి ఆయన బౌద్ధ గురువులు రాహుల్ బోధి, వివేక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నమ్మకాలనేవి మనిషిని విజ్ఞానం వైపు తీసుకువెళ్లేవిగా ఉండాలని తెలిపారు. బుద్ధుడు చూపిన సమానత్వం, సౌభ్రాతృత్వం విధానాలను అర్థం చేసుకుంటే సుఖమయ జీవనం పొందుతారని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛతో అభివృద్ధి సాధించాలని, సమాజానికి హాని కలిగించేలా ఏ కారకాలను అలవర్చుకోవద్దని సూచించారు.

ఆర్‌ఐకి వినతిపత్రం అందజేత

బిహార్ రాష్ట్రంలోని బుద్ధగయా మహాబోధి బుద్ధ వి హారను భారతీయ బౌద్ధ మహాసభ, ఆల్ ఇండియా భిక్కు సంఘానికి అప్పగించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ మాజిత్‌కు వినతిపత్రం అందజేశారు. బౌద్ధుల వారసత్వ సంపద ను బ్రాహ్మణులు అక్రమంగా అనుభవిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా బౌద్ధ ధమ్మ దీక్ష స్వీకరించిన శ్రామ్‌నేర్‌లు తహసీల్దార్ కార్యాలయ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్ మహోల్కర్, వినేశ్ ఉప్రే, దుర్గం సందీప్, దుర్గం సునీల్‌కుమార్, హంసరాజ్, విలా స్, రాజేంద్రప్రసాద్, హిరిషన్, బలవంత్, శ్రీధర్, సురేందర్, సాగర్, విఠల్ పాల్గొన్నారు.

'పన్నులు వసూలు చేయాలి'

కౌటాల: గ్రామాల్లో వందశాతం పన్నులు వసూలు చేయాలని డీపీవో భిక్షపతిగౌడ్ ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో కౌటాల, చింతలమానెపల్లి మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై మాట్లాడారు. ఈ నెల 20లోపు పన్నులు వసూలు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అర్హులతో విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేయించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీలకు నిధులు కరువు



కౌటాల మండలం తలోడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల చేతి పంపు వద్ద వీధి దీపం లేక రాత్రి సమయంలో నీళ్ల కోసం వచ్చిన మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి చేతి పంపు వద్ద బైక్‌లైట్ సాయంతో మహిళ నీళ్లు పట్టుకున్న వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.



శిథిలావస్థలో వీర్దండి గ్రామపంచాయతీ కార్యాలయం

- ఏడాదిగా ప్రత్యేక అధికారుల పాలన
- అప్పులు చేసి పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శులు
- నిధులు విడుదల చేయాలని వేడుకోలు

కౌటాల: గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత వేధిస్తోంది. దీంతో గ్రామాల్లో వీధి దీపాలు వెలగకపోయినా, బోరు పనిచేయకపోయినా ప్రజలు సమస్యలతోనే జీవించాల్సి వస్తోంది. గ్రామాలు ఏడాదికి పైగా ప్రత్యేకాధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శులపై పడింది.

జిల్లాలో 334 గ్రామ పంచాయతీలు..

జిల్లాలో 334 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో మేజర్ గ్రామపంచాయతీలతో పాటు చిన్న గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సర్పంచ్ పదవీకాలం ముగిసిన వెంటనే ప్రభుత్వం పలు శాఖలోని సీనియర్ అసిస్టెంట్లను గ్రామాలకు ప్రత్యేక అధికారులుగా నియమించింది. ప్రస్తుతం పాలకమండలి లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం జనాభా ప్రాతిపదికన విడుదల చేయాల్సిన ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీనెల రావాల్సిన ఎస్‌ఎఫ్‌సీ నిధులు కూడా ఆగిపోయాయి. కాగా సెప్టెంబర్, 2024లో స్వచ్ఛదనం.. పచ్చదనం కింద ప్రతీగ్రామ పంచాయతీకి రూ.50వేల చొప్పున నిధులు విడుదల చేసింది. దీంతో కొంతమేర ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని భావించిన పంచాయతీ కార్యదర్శులు, చెక్‌లను ట్రెజరీలో జమచేశారు. కానీ చెక్‌లు పాస్ కావడం లేదని, అకౌంట్లు ఫ్రీజింగ్‌లో ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు.

పన్నులు వసూలైనా..

గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, షాపుల అద్దెలు, ఇతర ట్యాక్స్‌లు వసూలైనప్పటికీ వాటిని నేరుగా ఖర్చు చేయడానికి వీల్లేదు. వాటిని సైతం ట్రెజరీలో జమ చేశాక పంచాయతీ అకౌంట్ నుంచి చెక్ రూపంలో ఆన్‌లైన్ ద్వారా డ్రా చేసుకోవాలి. కానీ ట్రెజరీలో జమ చేసిన వెంటనే ఫ్రీజింగ్ వస్తోందని.. దీంతో పన్నులు వసూలైనా గ్రామాల్లో సైతం ఆర్థిక వెతలు తప్పడం లేదని కార్యదర్శులు వాపోతున్నారు. ట్రాక్టర్లలో డీజిల్, వీధిలైట్ల ఏర్పాటు, పా రిశుద్ధ్య, స్పెషల్ డ్రైవ్, బ్లీచింగ్ పౌడర్, నల్లాల లీకేజీలకు మరమ్మతులు.. ఇలా గ్రామాల్లో అత్యవసరం కోసం ఖర్చు చేసే ప్రతి పైసా పంచాయతీ కా ర్యదర్శులు భరిస్తున్నారు. సొంత డబ్బులతో పనులు చేయించి అప్పులపాలయ్యామని, డబ్బులు ఇ ప్పించి ఆదుకోవాలని ఇటీవల పంచాయతీ కార్యదర్శులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

అప్పుల పాలయ్యాం..



గ్రామ పంచాయతీల్లో పాలకవర్గం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సైతం పంచాయతీ నిర్వహణకు నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో అప్పులు చేసి గ్రామాల్లో పనులు చేయిస్తున్నాం.

– భాస్కర్, మండల అధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శుల సంఘం

ఉన్నతాధికారులకు నివేదించాం



పంచాయతీలకు నిధులు విడుదల కాని మాట వాస్తవమే. నిధులు విడుదల చేయాలని ఇటీవల పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రాలు అందించారు. ఈ విషయం ఉన్నతాధికారులకు నివేదించాం.

– కోట ప్రసాద్, ఎంపీడీవో

ఇందిరమ్మ ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలి



ఇంటి నిర్మాణానికి కొలతలు పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

వాంకిడి: ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ అన్నారు. మండలంలోని బోర్దా గ్రామంలో ప్రభుత్వం ద్వారా ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులతో మంగళవారం మాట్లాడి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఇంటి నమూనా, నిర్మాణంలో ఏమైనా సందేహాలు ఉంటే హౌజింగ్ ఏఈ రత్నంను సంప్రదించాలని సూచించారు. లబ్ధిదారుల జాబితాను మరోసారి చదివి వినిపించారు. జాబితాలో పేర్లు ఉన్న వారు ఇంటి నిర్మాణానికి స్థలాన్ని చదును చేసుకుంటే సంబంధిత ఇంజినీర్ మార్కింగ్ ఇస్తారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరణ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెట్రోల్‌బంక్‌లను తనిఖీ చేయాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏవో మధుకర్‌కు ఫిర్యాదు చేశారు. బంక్‌లో వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించడంలేదని ఆరోపించారు. బంక్‌ల్లో తనిఖీలు నిర్వహించాలని కోరారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి కార్తిక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దినకర్, టీజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలాశ్రీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, టీఏజీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



బాణాసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకొంటున్న బీజేపీ నాయకులు

బెజ్జూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య ఘన విజయంపై మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ నాయకులు బాణాసంచాలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, మాజీ మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ మాట్లాడుతూ బీజేపీ బలపర్చిన కొమురయ్య విజయానికి సహకరించిన ఉపాధ్యాయులకు, నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మెస్రం రాజారాం, కుబిడె రాకేశ్, బెనికి శ్యాంసుందర్, నెల్లి మహేశ్, పొన్న ప్రవీణ్, పల్లెం పురుషోత్తం, శ్రావణ్ గౌడ్, ఇప్పకాయల శంకర్, చిప్పకుర్తి వెంకటి, సామల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లైన్‌మెన్ దినోత్సవం



లైన్‌మెన్‌లను సన్మానిస్తున్న ఏఈ రమేశ్

కెరమెరి: మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా లైన్‌మెన్‌ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్‌మెన్‌ల సేవలను గుర్తించి వారిని శాలువాలతో సన్మానించారు. విద్యుత్ ఏఈ రమేశ్ మాట్లాడుతూ ఇళ్లల్లో విద్యుత్ ప్రసరించేందుకు విద్యుత్ లైన్‌మెన్‌ల పాత్ర ఎంతో ఉందన్నారు. విద్యుత్‌ను నిరంతరం అందించేందుకు ఎన్నో కష్టాలు పడుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.



సిబ్బందిని సన్మానిస్తున్న ఏఈ ఇమ్రాన్

రెబ్బెన: విద్యుత్ సిబ్బంది రాత్రి, పగలు తేడాలేకుండా సేవలు అందిస్తుండడంతోనే వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందుతోందని ట్రాన్స్‌కో ఏఈ ఇమ్రాన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం సబ్‌స్టేషన్‌లో లైన్‌మెన్ డే సందర్భంగా రెబ్బెన సెక్షన్‌లో పని చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బందిని సన్మానించారు. ఫోర్‌మెన్ సీహెచ్ రమేశ్, గ్రేడ్‌వన్ లైన్ ఇన్స్‌పెక్టర్లు సురేశ్, రాజశేఖర్, లైన్‌మెన్ మల్లయ్య, అసిస్టెంట్ లైన్‌మెన్‌లు సురేశ్, శివకుమార్, మోతీరాం, హరీశ్ పాల్గొన్నారు.

జోడేఘాట్ మ్యూజియం సందర్శన



నివాళులర్పిస్తున్న విద్యార్థులు



ఆభరణాలు తిలకిస్తున్న విద్యార్థులు

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో గల కుమురం భీం మ్యూజియాన్ని మంగళవారం మండలంలోని సావర్‌ఖెడా ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం సందర్శించారు. తన సహచరులతో మాట్లాడుతున్న కుమురం భీం, నృత్యాలు చేస్తున్న గుస్సాడీలు, వివిధ రకాల ఆదివాసీల ఆభరణాలు, చిత్రమాలిక, ఆదివాసీల దేవతలు, వాటి చరిత్రను తిలకించి సంబరపడ్డారు. కాగా భీం చరిత్రను అడిగి తెలుసుకున్నారు. భీం విగ్రహానికి నివాళులర్పించారు. ఎంఈవో ఆడే ప్రకాశ్, హెచ్‌ఎం కడేర్ల రంగయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని బంబార గ్రామపంచాయతీ కేంద్రం బారెగూడలో మంగళవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో వడై దేవాజీకి చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అకస్మాత్తుగా ఇంట్లోంచి మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు చెలరేగుతున్న సమయంలో ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. పక్కనున్న ఇళ్లకు మంటలు చెలరేగకుండా గ్రామస్తులు అదుపుచేశారు. ఫైర్ ఇంజన్ ఘటన స్థలానికి వచ్చే లోగా ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదానికి విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణమై ఉంటుందని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పత్తి అమ్మిన డబ్బులు, నగలు మంటల్లో కాలిపోయాయని, కట్టుబట్టలతో రోడ్డుపై పడ్డామని దేవాజీ దంపతులు బోరున విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకున్నారు. కాగా ఆస్తి నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. ఎస్సై ప్రశాంత్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

సమయపాలన పాటించని వైద్యులు



వైద్యులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ

నార్నూర్: అన్ని ఉన్నా.. అల్లుడి నోట్లో శని ఉన్నట్లు ఉంది మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పని తీరు. వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో మారుమూల గ్రామాల నుంచి వైద్యం కోసం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మధ్యాహ్నం అయ్యిందంటే చాలు ఆసుపత్రిలో వైద్యులు కనిపించరు. కిందిస్థాయి సిబ్బంది మాత్రమే వైద్యం అందించి పంపిస్తున్నారు. అత్యవసర సమయంలో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి లేదా ఆదిలాబాద్ రిమ్స్‌కు రిఫర్ చేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా అక్రమ వెంచర్లు

- అసైన్డ్ భూముల్లో వెలుస్తున్న వైనం
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు
- పట్టించుకోని అధికారులు



అందుకులగూడ గ్రామ సమీపంలోని అసైన్డ్ భూమిలో అక్రమ వెంచర్

బెజ్జూర్: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. అసైన్డ్ భూముల్లో అక్రమ వెంచర్లు వేసి వారసంతలో కూరగాయలు అమ్మినట్లు విక్రయిస్తున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం కన్నెత్తి చూడడం లేదని మండలవాసులు ఆరోపిస్తున్నారు.

అమ్మరాదు.. కొనరాదు..?

భూమిలేని నిరుపేద రైతులకు గతంలోని ప్రభుత్వాలు అసైన్డ్ భూములు అందజేసి పట్టా కూడా ఇచ్చారు. ఆయా భూములు ఎవరి పేరు మీద అసైన్మెంట్ ఉంటే వారి కుటుంబ సభ్యులు మాత్రమే వ్యవసాయం చేసుకొని అనుభవించాలి తప్ప ఇతరులకు అమ్మకూడదనే ప్రభుత్వ నిబంధన ఉంది. అయినా మండలంలో నిబంధనలు పట్టించుకోకుండా అమాయక ఆదివాసీ గిరిజనులను మాయమాటలు చెప్పి కొందరు నాయకులు అసైన్డ్ భూములను కొనుగోలు చేయడమే కాకుండా వెంచర్లు వేసి విక్రయిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఏజెన్సీలోనూ..

మండలంలోని అందుగులగూడ ఏజెన్సీ ప్రాంతం. అక్కడి భూమిని ఇతరులు కొనడానికి ఇతరులకు అమ్మడానికి వీలులేదు. కొందరు అక్రమార్కులు ఆదివాసీ వ్యక్తిని మధ్యవర్తిగా ఉంచి అసైన్డ్ భూమిని స్టాంప్ పేపర్ ద్వారా కొనుగోలు చేసి అక్రమ వెంచర్లు వేసి అక్రమ కట్టడాలు నిర్వహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామస్తులు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేశారు. అయినా అధికారులు స్పందించడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. మండల కేంద్రంతో పాటు సలుకుపల్లి, అందుగులగూడ గ్రామాల్లోని అసైన్డ్ భూముల్లో అక్రమ వెంచర్లు వేయడంతో పాటు అనుమతులు లేకుండా ప్రధాన చౌరస్తాల్లో అక్రమంగా కట్టడాలు సైతం నిర్మించారు.

మాకేం సంబంధం..?

అక్రమ వెంచర్లు, అక్రమ కట్టడాలపై స్థానికులు పలుమార్లు ఫిర్యాదులు చేసినా, ఫోన్ల ద్వారా సమాచారం అందజేసిన అధికారులు మాత్రం స్పందించడం లేదు. 'ఎన్నికల్లో భాగంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నామని, ఎన్నికల అనంతరం వెళ్లిపోతామని మాకేం సంబంధం' అంటూ సంబంధిత అధికారులు సమాధానం ఇస్తున్నట్లు పలువురు చెబుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ భూమేశ్వర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీవో ఖాజా అజీజుద్దీన్

వాంకిడి: నర్సరీల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీవో ఖాజా అజీజుద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని నవేగూడ జీపీని సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లు వంద శాతం పూర్తి చేయాలన్నారు. బకాయిల వివరాలు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరీని పరిశీలించారు. మొలకెత్తిన మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఖాళీ బ్యాగుల్లో మళ్లీ విత్తనాలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో కారోబారి బాలు, సీనియర్ మేట్ శ్రీరామ్, పంచాయతీ కార్మికులు హరిదాస్, మహేందర్ ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



వాంకిడి: బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లు రాస్తున్న సిబ్బంది

వాంకిడి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. నేటి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానుండగా 400 మంది జూనియర్ కళాశాలల విద్యార్థులు, 97 మంది కేజీబీవీ ఇంటర్ విద్యార్థినులు పరీక్షలు రాయనున్నట్లు కళాశాల చీఫ్ సుపరింటెండెంట్ ఎం.చంద్రయ్య తెలిపారు. పరీక్షలకు డిపార్ట్‌మెంటల్ అధికారిగా ఆత్మారాం నియామితులయ్యారని, సీసీ కెమెరాల నిఘాలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని సూచించారు.

కెరమెరి: నేటి నుంచి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమవుతున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు సీఎస్ బైరాగి, డీవో ప్రభాకర్ తెలిపారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 171, సెకండ్ ఇయర్‌లో 136, మొత్తం 307 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు కొనసాగే పరీక్షలో మోడి కేజీబీవీ, కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు 9 గదుల్లో పరీక్షలు రాయనున్నారని, ఉదయం 8:30 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

పాఠశాలలో సైన్స్ మేళా



బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్స్‌మేళాను హెచ్‌ఎం విజయ నిర్మల ప్రారంభించారు. ఆయా తరగతులకు చెందిన విద్యార్థులు వివిధ రకాల నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ సైన్స్ మేళాలతో విద్యార్థులకు సృజనాత్మక పెంపొందుతుందన్నారు. ఉత్తమ ప్రదర్శన చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యాదగిరి, బడేసాహెబ్, గంగాభవాని, లక్ష్మి, సంతోష్, ధన్‌రాజ్, ఈశ్వర్‌రావు, నాగరాణి, సాదియా, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయ్‌కుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899